గోదాము అధికారుల తొండాట!

- అధికారుల పర్యవేక్షణలో కాటా వేసిన ధాన్యం వెనక్కి పంపుతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

జూపాడుబంగ్లా: కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణలో కందులు కాటా వేసి విక్రయించినా గోదాము అధికారులు ధాన్యం బాగోలేదంటూ వెనక్కి పంపుతుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటం రూ.7,550 చొప్పున కందులు కొనుగోలు చేస్తున్నారు. కందులు కొనుగోలు చేసే ప్రక్రియ సహకారసొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడు పర్యవేక్షణలో కొనసాగుతోంది. రైతు సేవా కేంద్రాల్లో కందులు విక్రయించేందుకు పేర్లు నమోదు చేయించుకున్న రైతుల వద్ద మాత్రమే అధికారులు కందులను కొనుగోలు చేస్తున్నారు. సొసైటీ సిబ్బంది కందులు కొనుగోలు చేసే ప్రక్రియను సొసైటీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో ధాన్యాన్ని జల్లెడ పట్టి కాటా వేస్తున్నారు. కాటా వేసిన ధాన్యాన్ని నంద్యాల, నందికొట్కూరు పట్టణాల్లోని కేంద్రగిడ్డంగుల గోదాముల్లో నిల్వచేస్తున్నారు. రైతుల ధాన్యాన్ని గోదాముల్లో నిల్వచేసేందుకు తరలించగా అక్కడి అధికారులు మరోసారి పరిశీలించి బాగోలేదని రైతులకు ఫోన్‌చేసి వెనక్కి తీసుకెళ్లాలని ఆదేశిస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన మల్లికార్జునకు చెందిన 42 సంచుల కందులు, వెంకటరెడ్డికి చెందిన 30 సంచులు, నారాయణ 20 ప్యాకెట్లు, మూలింటి రామిరెడ్డికి చెందిన 100 ప్యాకెట్లు, తంగడంచ రైతులకు చెందిన 30 ప్యాకెట్ల కందులను గోదాము అధికారులు వెనక్కి పంపించారు. దీంతో రైతులు చేసేదిలేక సొంత ఖర్చులతో నంద్యాల, నందికొట్కూరు గోదాముల నుంచి ధాన్యాన్ని వెనక్కి తెచ్చుకొన్నట్లు తెలిపారు. సొసైటీ అధికారుల పర్యవేక్షణలో కందులను జల్లెడపట్టి కాటా వేసినా గోదాము అధికారులు ధాన్యాన్ని రిజెక్ట్ చేయటం సబబుకాదని పేర్కొంటున్నారు. క్వింటం కందులు కాటా వేయటానికి రూ.140 హమాలీలకు చెల్లించి, గోదాము నుంచి రవాణా ఖర్చులు పెట్టుకుని ధాన్యాన్ని వెనక్కితెచ్చుకోవాలంటే ఎంత వ్యయ, ప్రయాసాలకు గురవ్వాల్సి ఉంటుందో అధికారులు ఆలోచించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పారుమంచాలలో దాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కందులను కాటావేస్తున్న హమాలీలు

ధాన్యం వెనక్కి తెచ్చుకున్నా



ఖరీఫ్‌లో సాగుచేసిన కందులు విక్రయకేంద్రంలో విక్రయించాను. క్వింటానికి రూ.140లు చెల్లించి జల్లెడప ట్టించి సొసైటీ అధికారుల సమక్షంలోనే కాటా వేయించాను. ధాన్యం నంద్యాల్లోని గోదాముకు తీసుకెళ్లారు. అక్కడి అధికారులు కందులు బాగోలేవని, వచ్చి తీసుకెళ్లాలని ఫోన్ చేశారు. సొంతఖర్చులతో నంద్యాల గోదాము నుంచి ధాన్యాన్ని వెనక్కి తెచ్చుకొని, మా గ్రామంలోనే తక్కువ ధరకు విక్రయించుకున్నాను.
– మల్లికార్జున, రైతు, పారుమంచాల గ్రామం

గోదాము అధికారులు వెనక్కి పంపుతున్నారు

మేము రైతుల వద్ద ధాన్యాన్ని జల్లెడ పట్టి, కాటా వేయించి గోదాముకు తరలిస్తున్నాం. గోదాము వద్ద అధికారులు పరిశీలించి బాగోలేని వాటిని వెనక్కి పంపుతున్నారు. అందుకు మేము బాధ్యులం ఎలా అవుతాం.
– చంద్రశేఖర్‌గౌడు, సీఈఓ, 80బన్నూరు సొసైటీ


క్లుప్తంగా

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన


విద్యార్థినులకు వివరిస్తున్న ఎస్‌ఐ జగన్‌మోహన్

బండిఆత్మకూరు: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులకు గురువారం ఎస్‌ఐ జగన్‌మోహన్ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతర స్టేషన్‌లో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ, సీసీ కెమెరాల నియంత్రణ విధానం, మహిళా రక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి, నేర నియంత్రణలో పోలీసుల పాత్రను విద్యార్థినులకు తెలియజేశారు.

ఆకట్టుకున్న ప్రవచనం


ప్రవచనం వినిపిస్తున్న సందీప్ శర్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మ దక్షయజ్ఞంపై ప్రవచనం వినిపించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పంచాయతీకి పెరిగిన ఆదాయం


వేలంపాటలు నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

వెలుగోడు: సంత మార్కెట్, బస్టాండు, కబేలాలకు నిర్వహించిన వేలంపాటల ద్వారా వెలుగోడు పంచాయతీకి గత ఏడాది కంటే రూ.3.70 లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చింది. సర్పంచ్ జయపాల్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన వేలంపాటల్లో వారపు సంత మార్కెట్ రూ.5,79,000లకు జబీబుల్లా దక్కించుకున్నారు. దినసరి మార్కెట్‌ను రూ.4.81 లక్షలకు సోయల్, కబేలాను రూ.2.13 లక్షలకు సలిముద్దీన్ దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుంకన్న తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంబాబు, విస్తరణ అధికారి నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

- ముగ్గురు ప్రయాణికులకు గాయాలు


గాయపడిన ప్రయాణికుడు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే మార్గంలో రివర్స్‌లో వస్తున్న ఓ లారీ ఆర్టీసీ బస్సును వెనుక వైపు ఢీకొనడంతో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. గురువారం మార్కాపురం నుంచి ఆర్టీసీ బస్సు నంద్యాల వైపు బయలుదేరింది. గాజులపల్లె వద్ద మదీనా రైస్ మిల్ సమీపంలో రివర్స్‌లో వస్తున్న లారీ ఆర్టీసీ బస్సు వెనుక వైపు ఢీకొంది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు అంకిరెడ్డిపల్లె ప్రేమరాజు, కంభం నాగశేషయ్య, కర్నూలు రామచంద్రుడు గాయపడ్డారు. రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

19న మహా ధర్నా


మాట్లాడుతున్న రమేష్‌బాబు

పాములపాడు: మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు కోరుతూ ఈనెల 19న విజయవాడలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మాట్లాడారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు విషయంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా విద్యార్థి మెస్ బిల్లులు పెంచాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జయమ్మ పాల్గొన్నారు.

9న ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9వ తేదీన పట్టణంలోని శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో సబ్ జూనియర్ కబడ్డీ బాలురు, బాలికలు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 30-03-2009 తర్వాత జన్మించి, 55 కేజీ ల్లోపు బరువు ఉండాలన్నారు. క్రీడాకారులు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, టెన్త్ క్లాస్ మార్క్స్ మెమో తీసుకొని రావాలన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పగిద్యాల: ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు భారీగా తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్, జిల్లా నాయకులు గోపాలక్రిష్ణ కోరారు. గురువారం నెహ్రూనగర్‌లో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. డిగ్రీ, పీజీలు పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాక ఉపాధి కూలీలు, భవన నిర్మాణ కార్మికులుగా మారుతున్నారని వారు ఆవేదన చెందారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబానికి సమ్మర్ అలవెన్స్‌ల కింద మళ్లీ పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి కేటాయించాల్సిన నిధుల్లో కోత విధించడం వల్లే కూలీలు వలస వెళ్లక తప్పడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 12న విజయవాడలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం తాలుకా నాయకురాలు ఈశ్వరమ్మ ఉన్నారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద కొలువైన దత్తాత్రేయ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

శ్రీశైలానికి ఫైర్‌స్టేషన్ తరలింపు

- బోసిపోయిన సున్నిపెంట కార్యాలయం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ఫైర్‌స్టేషన్‌ను అధికారులు శ్రీశైలం దేవస్థానానికి తరలించారు. 1964 మార్చి10న సున్నిపెంటలో సుమారు 1.5 ఎకరాల స్థలంలో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఒక ఫైర్ అధికారితో పాటు 18 మంది సిబ్బందిని నియమించారు. ఫైర్‌అధికారి నివాసాన్ని కూడా జలవనరుల శాఖ నిర్మించింది. సున్నిపెంటలో సుమారు 40 వేలు, లింగాలగట్టులో 6 వేలు, శ్రీశైలంలో 7 వేల జనాభా చొప్పున నివశిస్తున్నారు. సున్నిపెంట అటు శ్రీశైలానికి ఇటు లింగాలగట్టుకు మధ్య ఉంది. ఎక్కడ అగ్నిప్రమాదం, విపత్తు జరిగినా కొద్ది సమయంలోనే ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టే వీలుంది. జాతీయ ప్రాజెక్టులు శ్రీశైలం డ్యాం, కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం, 11కెవి స్విచ్‌యార్డులు కూడా సున్నిపెంట పరిసరాలల్లోనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టులలో ఏదైనా ప్రమాదం జరిగితే రూ.కోట్లలో నష్టం ఉంటుంది. అలాగే సున్నిపెంటలో హెలిప్యాడ్ కూడా ఉంది. రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, వ్యాపార దిగ్గజాలు, సినీతారలు ఇలా ఎందరో హెలికాప్టర్లలో తరచూ శ్రీశైలం వస్తూ సున్నిపెంటలో ల్యాండ్ అవుతుంటారు. హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో ఎటువంటి అగ్నిప్రమాదాలు జరగకుండా రక్షణగా ఫైర్‌వాహనంతో పాటు, సిబ్బంది హాజరవుతుంటారు. ఇప్పుడు ఫైర్ స్టేషన్‌ను శ్రీశైలంలో ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రద్దీ, ఘాట్‌రోడ్ దృష్ట్యా లింగాలగట్టుకు చేరాలంటే కనీసం గంట సమయం పడుతుంది. అయినప్పటికీ ఇంతటి అవసరాలు ఉన్నా ఫైర్‌స్టేషన్‌ను తరలించడంపై ప్రజలు మండిపడుతున్నారు.


బోసిబోయిన సున్నిపెంట ఫైర్‌స్టేషన్


శ్రీశైలం దేవస్థానంలో ఏర్పాటైన ఫైర్‌స్టేషన్

12న వేలం పాటలు

నందికొట్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని సంత నిర్వహణ హక్కులకు ఈనెల 12న వేలం పాట నిర్వహించనునున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వారపు సంత, దిన కూరగాయాల మార్కెట్, బస్టాండ్ ఫీజు, జంతు వధశాల, మాంసం మార్కెట్‌లకు జైకిసాన్ పార్కులో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 11 గంటలకు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు రూరల్: ఈనెల 8న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాజీ పడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసుల్లో లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకుని సమయం, డబ్బు ఆదా చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులు కూడా మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సూచించారు.

ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

పాములపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మ్యాథ్స్ పేపర్-1, వృక్షశాస్త్రం, సివిక్స్ ఎగ్జామ్ జరిగిందన్నారు. 200 మంది విద్యార్థులకు గానూ 197 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

జూపాడుబంగ్లా: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ల డిమాండ్ చేశారు. గురువారం ఆయన 80 బన్నూరు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు 150 రోజుల పనిదినాలు కల్పించటంతో పాటు వారానికోపర్యాయం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

జూపాడుబంగ్లా: సత్వరమే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు నల్లబోతుల రాముడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ శాసనమండలిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చాలని కోరడం హర్షనీయమన్నారు.

అదుపు తప్పిన బైక్.. ముగ్గురికి గాయాలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ నుంచి మహానందికి వచ్చే మార్గంలో ఎంసీ ఫారం సమీపంలో రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నల వల్ల బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. గాజులపల్లె ఆర్ఎస్‌కు చెందిన చంద్రకళ, చిన్నారులు సందీప్, యమున, రంగ గురువారం రాత్రి బైక్‌పై వస్తుండగా రోడ్డుపై మొక్కజొన్నల కోసమని అడ్డుగా పెట్టిన రాళ్లను గమనించకపోవడంతో అదుపు తప్పి కిందపడ్డారు. ముగ్గురికి స్వల్పగాయాలు కావడంతో మహానందిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు.

పశుగ్రాసం దగ్ధం

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో పశుగ్రాసం దగ్ధమైంది. బాధితు రైతులు ఈశ్వరయ్య, బొజ్జన్న, శివన్నకు సంబంధించిన సుమారు రూ.3 లక్షల విలువ చేసే పశుగ్రాసం కాలి బూడిదైంది. వివరాలు తెలియాల్సి ఉంది.

17 నుంచి పదో తరగతి పరీక్షలు

కొత్తపల్లి: ఈనెల 17వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ-2 ఇనాయతుల్లా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు. కొత్తపల్లి సెంటర్‌లో 200, గోకవరం సెంటర్‌లో 100 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పటేల్ సెంటర్‌లో కేజీ రోడ్డుపై ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, ఆటో కార్మికులు

నందికొట్కూరు: ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పటేల్ సెంటర్‌లో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ఆటో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకూ ఉద్యమ పోరాటం ఆగదన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తొమ్మిది నెలల గడుస్తున్నా అమలు చేయకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, దేవవరం, రామకృష్ణ, షేక్షావలి, రవికుమార్, సురేష్, నాగేశ్వరరావు, సూరి, మాబాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినతి..

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ డివిజన్ అధ్యక్షురాలు మదర్‌బీ, సీఐటీయూ పట్టణ అధ్యక్షులు గోపాల్‌కృష్ణ కోరారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఐసీడీపీఓ మంగవలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న విజయవాడలో జరిగే మహాధర్నాకు అంగన్‌వాడీ వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సరస్వతి, లక్ష్మి, అరుణ, షకూన్‌బీ, రాజేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో ఈ నెల 8వ తేదీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని యాగంటీశ్వర స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీల్లో గెలుపొందిన జట్లకు తొలి ఆరు స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు అదే రోజు ఉదయం 9 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 95531 31338, 82979 78854 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.


ఆలయం చుట్టూ ఉన్న గ్రిల్స్‌ను కోసి పక్కన పడేసిన దృశ్యం

పక్కన పడేశారు!

మహానంది: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సొంత నిధులతో మహానంది దేవస్థానం చుట్టూ ఐరన్ గ్రిల్స్ వేయించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసే గాజులు బొమ్మల దుకాణాల కోసం గ్రిల్స్‌ను కోసేయడం విమర్శలకు తావిస్తోంది. విషయంపై ఇంజినీరింగ్ అధికారి, ఏఈ శ్రీనివాసులను వివరణ కోరగా మళ్లీ వెల్డింగ్ వేయిస్తామని చెప్పుకొచ్చారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం


ప్రత్యేక అలంకరణలో సీతారాముల వారు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గురువారం కలాణోత్సవం నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణోత్సవం చేపట్టారు. అలాగే సీతా సమేత కోదండరాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా సీమ జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ఆలయ ప్రాంగణంలో వివాహాలు చేసుకోవడంతో నూతన వధూవరులతో పాటు బంధుమిత్రులతో ఆలయ ప్రాంగణాలు రద్దీగా కనిపించాయి.

గాలికుంటు టీకాలు వేయించాలి


టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీఏ రామాంజనేయ నాయక్


పగిద్యాల: సకాలంలో పశువులకు గాలి కుంటు టీకాలు వేయించాలని జూపాడుబంగ్లా డివిజన్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయులు నాయక్ సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమంలో భాగంగా గురువారం పాత ముచ్చుమర్రి, పగిద్యాల గ్రామాల్లో జరిగే వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించి పశుపోషకులతో మాట్లాడారు. గాలి కుంటు వ్యాధి బారిన పడిన పశువులు తీవ్ర జ్వరం, నీరసం, నోటి నుంచి సొంగ కారడం, నోరు, కాలిగెట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం తదితర లక్షణాలతో బాధ పడుతుంటాయన్నారు. పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం తగ్గిపోవడంతోపాటు మరణాలు కూడా సంభవించే ప్రమాదం ఉందన్నారు. టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని సూచించారు. పాత ముచ్చుమర్రి పశుగణాభివృద్ధి కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఏడీఏ వెంట పగిద్యాల పశు వైద్యులు శ్రుతికీర్తి, వీఎల్‌ఓ శ్రీనివాసులు, వీఏలు, వీరేష్, రాజశేఖర్, చరిత ఉన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్‌ఐ జవ్రుల్లా మాట్లాడుతూ మండల పరిధిలోని కోళ్ల బావాపురం సమీపంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీలు చేశామన్నారు. 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని బెల్లం ఊటను పారబోశామన్నారు. అనంతరం నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నాటు సారా జోలికి వెళ్లొద్దని కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. తనిఖీల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది కుమారి, శంకర్ నాయక్, సుధీర్‌కుమార్, శివన్న, మధుప్రసాద్, రమిజాబీ పాల్గొన్నారు.


బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రోడ్డుప్రమాదంలో వృద్ధుడి మృతి


సుబ్బారెడ్డి(ఫైల్)

కొత్తపల్లి: కొత్తపల్లి – ఎం.లింగాపురం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. వీరాపురం గ్రామానికి చెందిన బోగోలు సుబ్బారెడ్డి(75), శివలింగారెడ్డి ఎక్సెల్ మోటార్ సైకిల్‌పై గోకవరం గ్రామ శివారులోని దర్గా వద్ద జరిగిన ఉరుసుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఎం.లింగాపురం గ్రామం దాటిన తర్వాత పెట్రోల్ అయిపోవడంతో శివలింగారెడ్డి వేరే బండిపై వస్తానని అక్కడే ఆగిపోయాడు. సుబ్బారెడ్డి మోటారు సైకిల్‌ను మళ్లీ స్టార్ట్ చేసుకుని బయలుదేరాడు. కాగా వెనుక నుంచి వచ్చిన శివలింగారెడ్డికి కొత్తపల్లి మలుపువద్ద రోడ్డుపై రక్తపుమడుగులో అపస్మారక స్థితిలో పడిఉన్న సుబ్బారెడ్డి కనించాడు. అటుగా వెళ్తున్న వారి సాయంతో కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆత్మకూరుకు, అటు నుంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కాగా ఏదైనా వాహనం ఢీకొందా, లేక తనంతట తానే మోటారు సైకిల్ నుంచి కింద పడ్డాడా అనే విషయాలు తెలియరాలేదు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

- డీఈఓ జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నందికొట్కూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో కలిసి సరస్వతి పూజా కార్యక్రమలో డీఈఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరీక్షకు ఎలా సిద్ధం కావాలో ముఖ్యమైన అంశాలను తెలియజేశారు. అనంతరం పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా కెమిస్ట్రీ ల్యాబ్‌ను, పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ సుభాన్, హెచ్‌ఎం రామచంద్రమూర్తి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: ప్రతి గ్రామ పంచాయతీలో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహన కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని, చెత్త నుంచి సంపదను తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్డీ అధ్యక్షతన హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వానపాముల ఎరువు తయారు చేసి ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.